<u>పత్రికా ప్రకటన - 2</u>

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 30.07.2014

కొద్ది రోజుల్లోనే తీసుకొచ్చే తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానం ప్రపంచంలోనే అత్యుత్తమంగా వుంటుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. పిరమల్ గ్రూప్ చైర్మన్ అజయ్ పిరమల్ నాయకత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రితో సచివాలయంలో సమావేశమయింది.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణ పారిశ్రామిక విధానం ఎలా వుండబోతుందో సూచన ప్రాయంగా తెలిపారు. పలు దేశాలలో అమలవుతున్న పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేశామని, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో పలు దఫాలుగా చర్యలు జరిపామని, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకున్నామని, తెలంగాణ ప్రాంతానికి అనువైన విధానాల రూపకల్పనకు ప్రాధాన్యతనిచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పారిశ్రామిక విధానం రూపొందించటమే కాకుండా దాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు కుడా కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పారిశ్రామిక విధానం కీలకంగా మారాలనే ఉద్దేశ్యంతో పాటు ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం కూడా తమకుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోనే చేజింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని, దేశ విదేశాల నుండి వచ్చే పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానించి అవసరమైన అనుమతులిచ్చేందుకు సులభ తరమైన, సరళమైన, అవినీతి రహితమైన, వేగవంతమైన సింగిల్ విండో వ్యవస్థను నెలకొల్పుతామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం కూడా తెస్తామని వెల్లడించారు. తెలంగాణలో ఇప్పటికే 2 లక్షల ఎకరాలను పరిశ్రమలకు కేటాయించేందుకు సిద్ధం చేశామని, దాన్ని టిఎస్ఐఐసికి అప్పగిస్తామన్నారు. భూమి, నీరు, కరెంట్ తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు, సంబంధిత అనుమతులు కూడా టిఎస్ఐఐసి పొందుతుందని వెల్లడించారు. విప్రో సంస్థ 5 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలు స్థాపించడానికి ముందుకువచ్చాయని, ఇలా చాలా సంస్థలు తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. పిరమల్ సంస్థకు కూడా కావలసిన సహాయం అందించేందుకు, భూమి ఇతర సదుపాయాలు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి సంసిద్ధత వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా అవినీతిని ప్రోత్సహించమని, వెబ్సైట్లోనే దరఖాస్తులు ఇచ్చి ఆన్లైన్ లోనే వాటిని స్వీకరించి పరిశీలించే విధంగా పారదర్శక పద్ధతులు అవలంభిస్తామన్నారు. పరిశ్రమలతో పాటు అదే పారిశ్రామిక వాడలో ఉద్యోగుల కోసం టౌన్ షిప్పులు కుడా అభివృద్ధి చేసే ఆలోచన ప్రభుత్వానికి

వుందని చెప్పారు. గతంలో పారిశ్రామిక వేత్తలు వివిధ రకాల అనుమతుల కోసం అనేక కార్యాలయాలు తిరగాల్సి వుండేదని, కింది నుంచి పై వరకు ఎంతో మందిని ఒప్పించాల్సి వుండేదని, కాని ఇప్పుడు ఆ పద్ధతికి స్వస్తి పలుకుతున్నామని చెప్పారు. అన్ని అనుమతులు దరఖాస్తు చేసిన రెండు వారల్లోగా పొందుతారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్నేహశీల పారిశ్రామిక స్ఫూర్తి ప్రదర్శిస్తుందని వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ లోటు వున్న మాట నిజమే అయినప్పటికి త్వరలోనే ఈ సమస్యను అధిగమిస్తామని చెప్పారు. 2015 లోగా ఎన్‌టిపిసి నుండి 4000 మెగావాట్లు, ఇతరత్రా మరో 2350 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. మూడేళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రం విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారుతుందని, ఇందుకోసం మధ్య తరహా, దీర్ఘ కాలిక ప్రణాళికలు రూపొందించామన్నారు. గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాల ఫలితాన్ని తెలంగాణ ప్రజలు ఇప్పుడు రాష్ట్రాన్ని చక్క దిద్దే పని తాము చేపట్టామని చెప్పారు. రాబోయే రెండు మూడు నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం వస్తుందని వెల్లడించారు. రాష్ట్రానికి సంబంధించిన అన్ని విషయాలపై సరైన గణాంకాలు కూడా లేవని, ఇప్పుడు తమ ప్రభుత్వం సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. రాష్ట్రంలోని 84 లక్షల కుటుంబాల సర్వేను ఒకే రోజు నిర్వహించడానికి కార్యచరణ సిద్ధం చేశామన్నారు. ఫార్మా సిటిని నిర్మించనున్నామని, అందులో పరిశ్రమలతో పాటు ఉద్యోగుల కాలనీ ఏర్పాటు చేసేందుకు సిద్ధం కావాలని పిరమల్‌కు ముఖ్యమంత్రి సూచించారు.

సమావేశంలో విద్యాశాఖామంత్రి జగదీశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఒ ప్రిన్సిపల్ కార్యదర్శి నర్సింగ్ రావు, అజయ్ పిరమల్, పరేష్, డాక్టర్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం.**